క్లుప్తంగా

పారిశ్రామిక ప్రాంతంలో పర్యటించండి



వైవీ సుబ్బారెడ్డికి అభివాదం చేస్తున్న బద్రీనాథ్

మల్కాపురం: ఇండస్ట్రియల్ జోన్‌గా పేరుగాంచిన తమ ప్రాంతంలో ఒక్క సారి పూర్తి స్థాయిలో పర్యటించాలని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ కోరారు. 59వ వార్డులో పార్టీ నూతన కార్యాలయ ప్రారంభానికి గురువారం వచ్చిన ఆయనను బద్రీనాథ్ కలిసి మాట్లాడారు. పారిశ్రామిక ప్రాంత కార్మికుల సమస్యలు, పలు పరిశ్రమల యాజమాన్యాల తీరును గుర్తించాలన్నారు. పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ సూచనలతో త్వరలో కార్మికుల సంక్షేమం కోసం తన ఆధ్వర్యంలో ఈ ప్రాంతంలో నిర్వహించనున్న సమావేశానికి తప్పక హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నిరాశ్రయులందరికీ ఆశ్రయం



నిరాశ్రయుడి వివరాలు సేకరిస్తున్న మమత

విశాఖ విద్య: నిరాశ్రయులందరికీ జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షెల్టర్లలో ఆశ్రయం కల్పించేలా శ్రద్ధ తీసుకుంటున్నామని ఎన్‌ఏడీ బుచ్చిరాజుపాలెం షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత తెలిపారు. జీవీఎంసీ అధికారుల ఆదేశాల మేరకు గురువారం ఎన్‌ఏడీ కూడలిలో స్థానిక పోలీసు సిబ్బందితో కలిసి రోడ్ల పక్కన ఉన్న నిరాశ్రయుల వివరాలు సేకరించారు. జీవీఎంసీ షెల్టర్‌లో ఉచిత వసతి, భోజన సదుపాయాలను కల్పిస్తున్నందున, అక్కడికి తరలి రావాలని సూచించారు. నిరాశ్రయులకు అన్ని విధాలుగా ఆసరాగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తత అవసరం



డిజిటల్ స్క్రీన్ ద్వారా అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మల్కాపురం: నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మల్కాపురం లా అండ్ ఆర్డర్ సీఐ జీ.డి.బాబు, ట్రాఫిక్ ఎస్ఐ సుదర్శన్‌రావు సూచించారు. నేరాలు జరుగుతున్న తీరు, సైబర్ క్రైం తదితర అంశాలపై మల్కాపురం, శ్రీహరిపురం కూడళ్ల వద్ద గురువారం డిజిటల్ స్క్రీన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అమాయకులను మోసం చేయడంపైనే మోసగాళ్ల దృష్టి ఉంటుందన్నారు. ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

22న స్టీల్‌ప్లాంట్‌లో బతుకమ్మ సంబరాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఈ నెల 22న బతుకమ్మ పండగ నిర్వహిస్తున్నామని స్టీల్‌ప్లాంట్ తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు తెలిపారు. గురువారం ఉక్కునగరంలో నిర్వహించిన సంఘం కార్యవర్గ సమావేశంలో ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్ మాట్లాడారు. ఈ ఏడాది కూడా బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తెలంగాణా ఉద్యోగులందరూ తమ కుటుంబ సభ్యులతో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఎస్.కుమారస్వామి, బి.వెంకటేశ్వర్లు, ఎన్.నర్సింగరావు, ఎన్.చందర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

అందరి ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందుకున్న వారితో ఆదారి ఆనంద్‌కుమార్



కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు

- అందుకే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కు శ్రీకారం
- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్
- ములగాడలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన

మల్కాపురం: ప్రతీ ఇంట ఆనందం నిండాలి.. ఇంట్లో అందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి అన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఏపీ ఎంఎస్ఎంఈడీసీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ అన్నారు. ఆ దిశగా ఇప్పటికే ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వసతుల కల్పన, పూర్తిస్థాయిలో డాక్టర్ల నియామకం, యూపీహెచ్‌సీల సంఖ్య పెంచడంతో పాటు ఫ్యామిలీ ఫిజీషియన్ తదితర కార్యక్రమాల ద్వారా పేదలకు వైద్యం చేరువ చేశారన్నారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ప్రతీ ఒక్కరికీ అందుబాటులో నిపుణులైన వైద్యులతో సేవలు అందించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. 58వ వార్డు ములగాడ వద్ద గల పట్టణ ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, ఇతర వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యంపై సర్వే నిర్వహించారన్నారు. అవసరమైన వారికి అక్కడే తక్షణం కొన్ని వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారు శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకునేలా టోకెన్లు అందించారని తెలిపారు. ఈ శిబిరాల్లో జనరల్ వైద్యులతో పాటు స్పెషలిస్టులు కూడా అందుబాటులో ఉన్నారని చెప్పారు. వారు వైద్యపరీక్షలు చేసి మందులు అందిస్తారని, అవసరమైతే వేరే ఆస్పత్రులకు కూడా రిఫర్ చేస్తారని తెలిపారు. పేదలకు పైసా ఖర్చు లేకుండా మంచి వైద్యం అందుతుందన్నారు. ప్రజారోగ్యం కోసం రూపొందించిన ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శిబిరానికి వచ్చిన రోగులకు వైద్యులు సేవలు అందించి, మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి రక్తపరీక్షలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గులిగిందల లావణ్య, జోన్-5 జెడ్సీ కృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీష్, నోడల్ ఆఫీసర్ ఉమావతి, డీఐవో డాక్టర్ జీవన్‌రాణి జీవన్‌రాణి, ములగాడ తహసీల్దార్ డి.వీరభద్రరావు, ఏపీడీ చిరంజీవి, మెడికల్ ఆఫీసర్ తిలక్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్-4 సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చురుగ్గా సాగుతోంది. ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలను తెలుసుకుని, వివరాలు నమోదు చేస్తున్నారు. మరిన్ని వైద్య పరీక్షలు, చికిత్స అవసరమైన వారికి టోకెన్లు అందించి, శిబిరానికి రావాలని తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య సేవలను ప్రజల ముంగిటకే అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ శిబిరంలో స్పెషలిస్ట్ డాక్టర్లు అందుబాటులో ఉండి ఉచిత వైద్య పరీక్షలతో పాటు చికిత్స అందించి, మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ హెల్త్ సెక్రటరీ రమ్య, ఇతర నాయకులు, వార్డు వలంటీర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ సాయి

కంచరపాలెం: నేరాల నియంత్రణపై గవర కంచరపాలెం గ్రామాభ్యుదయ సంఘం కళా ప్రాంగణంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు, దొంగతనాల నియంత్రణపై కంచరపాలెం లా అండ్ ఆర్డర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సాయి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. గ్రామంలో దుకాణాలు అపార్ట్‌మెంట్లు, దేవాలయాలు, చర్చిలు సంఘాల భవనాలకు కచ్చితంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై మహిళలు జాగ్రత్తగా ఉండాలన్నారు. కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు మాట్లాడుతూ ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. బీఆర్‌టీఎస్ రహదారిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం చర్యలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ఆదారి శ్రీనివాసరావు, గ్రామాభ్యుదయ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో రక్షణ



సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరిస్తున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి

గోపాలపట్నం: ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులకు సమానమని వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి అన్నారు. గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో గురువారం వ్యాపారస్తులకు పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన తరువాత సీసీ కెమెరాల ఆవశ్యకతకు ప్రాధాన్యం ఏర్పడిందన్నారు. నేరాల నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతోపాటు ప్రజల సహకారం కూడా అవసరమన్నారు. అపార్ట్‌మెంట్లు, దుకాణాల వద్ద రక్షణగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీస్ విచారణ, నేర పరిశోధనకు కూడా సీసీ టీవీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో గోపాలపట్నం క్రైం ఎస్ఐ సూర నర్సింగరాజు, లా అండ్ ఆర్డర్ ఎస్ఐ అన్నల పాయుడు, గోపాలపట్నం ప్రాంత వ్యాపారులు, స్థానికులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

- నగరంలో 15 కూడళ్ల గుర్తింపు
- ప్రత్యేక బందాలతో ట్రాఫిక్ పర్యవేక్షణ
- డీసీపీ-1 శ్రీనివాసరావు



ద్వారకా పోలీస్ స్టేషన్‌లో డీసీపీ-1 శ్రీనివాసరావు

సీతమ్మధార: నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేస్తున్నట్లు డీసీపీ-1 శ్రీనివాసరావు తెలిపారు. ఫోర్త్‌టౌన్, ద్వారకా పోలీస్ స్టేషన్లను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మహా విశాఖలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని 15 ప్రధాన కూడళ్లు మద్దిలపాలెం, హనుమంతువాక, సిరిపురం, గాజువాక, ఎన్ఏడీ, గోపాలపట్నం, కొమ్మాది, గురుద్వారా, పెందుర్తితోపాటు పలు ప్రాంతాలను గుర్తించామన్నారు. ఉన్నత స్థాయి అధికారులతో ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ రెగ్యులేషన్ కోసం చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6.30 గంటల వరకు 15 జంక్షన్ల వద్ద ట్రాఫిక్ లా అండ్ ఆర్డర్, క్రైం, రిజర్వ్ పోలీసులు పర్యవేక్షిస్తారన్నారు. ఫ్రీ లెఫ్ట్ ఉపయోగించకుండా రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న వారు, బస్ బేల వద్ద ఆటోలు నిలిపివేస్తున్న వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి చర్యలు చేపడతామన్నారు. నగర ప్రజలు పోలీసులకు సహకరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

నగరంలోని రౌడీషీటర్లపై, గంజాయి తరలింపు కేసులపై ప్రత్యేక నిఘా పెట్టామని డీసీపీ-1 శ్రీనివాసరావు తెలిపారు. పాత కేసుల్లో ఉన్న వారి వివరాలు సేకరించామని, వారి రోజు వారి విధానాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నగరంలో అల్లర్లు, గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించామని చెప్పారు. డీసీపీ శ్రీనివాసరావుతోపాటు ద్వారకా ఏసీపీ మూర్తి, ద్వారకా ఇన్‌చార్జి సీఐ భాస్కరరావు, ఎస్ఐ అప్పలరాజు తదితరులు ఉన్నారు.

మళ్లీ గెలిచేది వైఎస్సార్‌సీపీయే..

- ప్రతిపక్షాలన్నీ కలిసి వచ్చినా.. విజయం తథ్యం
- పేద కుటుంబాల్లో సంక్షేమ వెలుగులు నింపిన సీఎం జగన్
- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సభకు భారీగా హాజరైన జనం

మల్కాపురం: ప్రతిపక్షాలన్నీ కలిసి వచ్చినా.. మళ్లీ గెలిచేది తమ పార్టీయేనని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని జోస్యం చెప్పారు. జీవీఎంసీ 59వ వార్డు నక్కవానిపాలెంలో నిర్మించిన వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయాన్ని గురువారం పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ముందుగా సభా వేదిక వద్ద దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైవీ సుబ్బారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుపేద కుటుంబాల్లో సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాల ద్వారా వెలుగులు నింపారన్నారు. రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలు సంక్షేమ ఫలాలను అందుకుని ఆనందంగా జీవిస్తున్నాయని చెప్పారు. 32 లక్షల మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందిచ్చి వారి సొంతింటి కలను నెరవేర్చారని కొనియాడారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి ఉచితంగా వైద్య సేవలను అందిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు సీఎం జగన్ విశేష కృషి చేస్తున్నారన్నారు.

చంద్రబాబును నమ్మి మోసపోకండి

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును రాష్ట్ర ప్రజలెవరూ నమ్మే స్థితిలో లేరని వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎంత అవినీతికి పాల్పడ్డారో, హామీలను ఎలా అటకెక్కించారో అందరికీ తెలుసన్నారు. చంద్రబాబును, రాష్ట్ర ప్రభుత్వంపై టీడీపీ, జనసేన, ఎల్లో మీడియా చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు. త్వరలోనే ఆర్పీలకు వేతనాలు పెరిగేలా చర్యలు తీసుకుంటామని, వారికి యూనిఫారాలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

అందరికీ అందుబాటులో కార్యాలయం

ఆదారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ 40, 58, 59, 60, 61, 62, 63 వార్డుల ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉండేలా నక్కవానిపాలెంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను ఏ సమయంలోనైనా వచ్చి తెలియజేయవచ్చని కోరారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరిపామని చెప్పారు. త్వరలోనే మరో రూ.45 కోట్లతో అభివృద్ధి చేపట్టనున్నట్టు వివరించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. టీడీపీ, జనసేన, ఇతర పార్టీల నాయకులు ఓట్ల కోసం మోసపూరిత హామీలతో వస్తారని.. వారి మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. ప్రతి నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, వ్యవసాయ మార్కెటింగ్ బోర్డ్ చైర్మన్ ఆల్ఫా కృష్ణ, పలు వార్డుల కార్పొరేటర్లు పుర్రె పూర్ణశ్రీ యాదవ్, గులిగిందల లావణ్య, కొణతాల సుధ, బల్లా లక్ష్మణరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

కంచరపాలెం: కంచరపాలెం అశోక్‌నగర్‌లోని ఆంధ్ర బౌద్ధ సమాజ కేంద్రంలో ఈ నెల 10 నుంచి మహిళలకు టైలరింగ్‌లో 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సమాజ ప్రధాన కార్యదర్శి కె.రాజు గణేష్ ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి గల మహిళలు, యువతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 96760 30455 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

మల్కాపురం క్రైం కానిస్టేబుల్ సస్పెన్షన్

మల్కాపురం: మల్కాపురం పోలీస్ స్టేషన్ క్రైం కానిస్టేబుల్ మహమ్మద్ ఆయూబ్ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలివి.. ఈ నెల 2న గంగవరం పోర్ట్ సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయూబ్ ఓ పాన్‌షాపులో డబ్బులు ఇవ్వకుండా సిగరెట్లు కావాలని అడగ్గా దుకాణ యజమాని నిరాకరించాడు. దీంతో ఆ దుకాణం రోడ్డుకు అడ్డుగా ఉందని తొలగించాలని ఇతరుల పేరుతో ఆయూబ్ 112కు ఫోన్ చేశాడు. మరుసటి రోజు కూడా మళ్లీ 112కు ఫోన్ చేసి, అదే దుకాణంపై ఫిర్యాదు చేశాడు. కానిస్టేబుల్ తనను ఇబ్బందిపెడుతున్నాడని దుకాణ యజమాని పోలీస్ ఉన్నతాధికారులకు తెలియజేశాడు. ఆయూబ్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు గుర్తించి పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేశారు.

నిరాశ్రయులకు చేయూత



నిరాశ్రయులకు ఆహారం అందిస్తున్న ఎస్ఐ రవికిషోర్

మర్రిపాలెం: ప్రపంచ నిరాశ్రయుల దినోత్సవం సందర్భంగా ఏయూటీడీ సంస్థ ఆధ్వర్యంలో అండర్ ది స్టార్స్ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు. జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయం దరి బీఆర్‌టీఎస్ బస్టాప్ వద్ద గురువారం రాత్రి కంచరపాలెం ఫిఫ్త్ టౌన్ ఎస్ఐ రవికిషోర్ నిరాశ్రయులకు ఆహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏయూటీడీ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఒక రోజు నిరాశ్రయులు పడుతున్న బాధలు తెలుసుకుని ప్రపంచానికి తెలియజేయడం హర్షణీయమన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని చెప్పారు.

స్టీల్‌ప్లాంట్ సమస్యలపై ఏచూరికి వినతి

ఉక్కునగరం: ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్టీల్‌ప్లాంట్ సమస్యలపై సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి వివరించారు. ఉక్కుహౌస్‌లో జరిగిన కార్యక్రమంలో వారు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమం తీరును వివరించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తేవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యానికి చేస్తున్న ప్రయత్నాలను ఆయన దృష్టికి తెచ్చారు. స్టీల్‌ప్లాంట్‌కు ఐరన్ ఓర్, కోల్ సరఫరాపై జరుగుతున్న అవాంతరాలను వివరించారు. సిబ్బంది తగ్గిపోతున్నా నూతన నియామకాలు జరగడం లేదని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించడం, కొత్త నియామకాలు చేపట్టడం, కార్మికులకు నూతన వేతన ఒప్పందం అమలు తదితర అంశాలపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, పోరాట కమిటీ నాయకులు సీహెచ్.నర్సింగరావు, కె.ఎస్.ఎన్.రావు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు.. దేశ ప్రజలందరి హక్కు

- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



ఉక్కు దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

కూర్మన్నపాలెం: జాతీయ సంపదైన విశాఖ ఉక్కు దేశ ప్రజలందరి హక్కు అని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ఎందరో మహనీయుల త్యాగాలతో సాధించుకున్న అటువంటి పరిశ్రమను ఐక్య పోరాటాలతోనే కాపాడుకోగలమన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే దీక్ష శిబిరాన్ని 966వ రోజు గురువారం ఆయన సందర్శించారు. కార్మికుల పోరాటానికి సంఘీభావం తెలిపారు.

పెట్టుబడిదారులకు లక్షల కోట్ల రుణమాఫీ

సీతారాం ఏచూరి మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయడమే బీజేపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత 9 ఏళ్లలో పెట్టుబడిదారులకు మోదీ ప్రభుత్వం లక్షల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసిందన్నారు. ఉక్కు కర్మాగారానికి ఉన్న అప్పులు చాలా తక్కువ అని, వాటిని రుణమాఫీ చేయాలంటే మోదీకి సులువైన పని అన్నారు. కానీ అలా చేయకుండా ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయడం అన్యాయమన్నారు. ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామని మోదీ స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు చేస్తున్న పోరాటాలను కేంద్ర ప్రభుత్వం విచ్ఛిన్నం చేయాలని చూస్తోందని, ఎందరో త్యాగధనుల పోరాట ఫలితంగా ఏర్పడిన విశాఖ ఉక్కు పరిశ్రమను కార్మికుల ఐక్య పోరాటాలతో కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవలో 22 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు మీసాల అశోక్‌కుమార్, బి.అనురాధ, ఎస్.సతీష్, ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్.సురేష్, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రోషా

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో గురువారం కళాశాల హెల్త్ కమిటీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ల సంయుక్త ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి మాట్లాడుతూ ప్రతి ఏడాది అక్టోబర్ నెలను బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ మంత్‌గా నిర్వహిస్తారన్నారు. ఎక్కువ శాతం మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. డాక్టర్ హోమిబాబా క్యాన్సర్ హాస్పటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ప్రివెంటీవ్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ రోషా బ్రెస్ట్ క్యాన్సర్ రావడానికి కారకాలు, రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, చికిత్స విధానాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ జె.లావణ్య, హెల్త్‌క్లబ్ ఇన్‌చార్జ్ ఎ.జ్యోతి, మైక్రోబయాలజీ అధ్యాపకురాలు డాక్టర్ టి.వరలక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కథల పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆచార్యులు అయ్యగారి సీతారత్నం రచించిన కూరాకులమడి కథల పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సమకాలీన, సాంఘిక సమస్యలపై అవగాహనతో ఆసక్తికరంగా, విజ్ఞాన దాయకంగా రాసిన కథల సంపుటిగా ఈ పుస్తకం నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.